ఉత్తమ గురువుల ఎడల శిష్యుల ప్రవర్తన ఎలా ఉండాలంటే......

## ఆచార్యదేవోభవ

**మాష్టారూ!**

నేను మీకు జ్ఞాపకం వున్నానా! నా పేరు రామారావు. గునుపూడి హైస్కూల్లో మీరు చదువు చెప్పే రోజుల్లో మీ శిష్యుల్లో నేనూ ఒకడ్ని. ఎస్సెల్సీ పాసై ఆ ఊరు వదిలేసాక మళ్లీ అటు వచ్చే అవసరమూ, అవకాశమూ లేక తిరిగి మీ దర్శనం చేసుకోలేకపోయాను. అయినా మీరంటే గౌరవం, భక్తి, అభిమానమూ నా మనసులో చోటు చేసుకోవడంతో నేను మిమ్మల్ని మరచిపోలేని మాట వాస్తవం.

ఈ గడిచిన పదేళ్ల కాలంలోనూ వందలాదిగా విద్యార్థులు మీ దగ్గర విద్యాబుద్ధులు నేర్చుకుని వుంటారు. అంతమందిలో నేను మీకు జ్ఞాపకం వుండాలనుకోవడం అవివేకం అవుతుంది.

ఆ రోజుల్లోనే క్లాసుకి నలభై మందికి పైగా విద్యార్థులుండేవారు. మీరు అందర్నీ సమానంగానే ఆదరించేవారు. మా అందరికీ కూడా మీరంటే ఎంతో భక్తి భావం వుండేది. మీరు విజ్ఞాన, వినోదాలు జోడించి మనసుకు హత్తుకునేలా చెప్పే పాఠాలు వినడానికి పై క్లాసుల విద్యార్థులు కూడా వచ్చి మా క్లాసులో కూర్చోవడం నా కిప్పటికీ జ్ఞాపకం వుంది.

అసలు నేను 'సి' సెక్షన్ లోంచి 'బి' సెక్షన్‌లోకి పేరు మార్పించుకోవడానికి కారణం మీరు 'బి'కి క్లాస్ టీచరు కావడమే! మీకు గుర్తుందా! ఓసారి మీకు గునుపూడి నుంచి బదిలీ అయినప్పుడు మేమంతా అర్జీలు పెట్టి అది ఆపు చేయించాము. అది మా స్కూలు చరిత్రలోనే చెరగరాని పుటగా మిగిలిపోయింది. మీకంతటి మంచి పేరు రావడం టైట్ ఫిటింగ్ మాస్టారుకి కంట్లో నలుసుగా వుండేది. అయినా మీరెప్పుడూ ఈర్ష్యాసూయాలకు అతీతంగా వుండేవారు.

పరీక్షలు పాసవడానికి మీరు పుస్తకాల్లో పాఠాలు చెప్పడం ఒక ఎత్తు. జీవితపు బాటల్లో తప్పటడుగులు వేయకుండా విద్యార్థుల్ని సరిదిద్దడం మరొక ఎత్తు. మీరే చెప్పినట్టు చిన్నప్పటి మా మనసులు అక్షరాలు రాయని కొత్త పలక లాంటివి. వాటి మీద ప్రప్రథమంగా ఎలాంటి అక్షరాలు రాస్తే ఆ ముద్రలే కలకాలం వుండిపోతాయి. అందుకే బడిలోనూ, బైటా కూడా మా అందరికీ మంచి బుద్ధులు నూరిపోసేవారు మీరు.

"నేటి నీ స్థితికి నీ పూర్వులు కారణం. రేపటి నీ పిల్లల పరిస్థితికి నువ్వు కారణం" అని అప్పుడు మీరు చెప్పిన మాటలు ఎంతటి అక్షర సత్యాలో ఇప్పుడు నాకు అర్థమవుతోంది.

మహాత్మాగాంధీ నిరాడంబరతనీ, పండిత నెహ్రూ ముందుచూపునీ జీవితాదర్శాలుగా మలచుకోమని బోధిస్తూ వుండేవారు. "ఒక న్యూక్లియర్ రియాక్టర్, ఒక రిఫైనరీ, ఒక ఇరిగేషన్ ప్రాజెక్టు - ఇవే మీరు దేశానికిచ్చే దేవాలయాలు. మీరంతా పెద్ద చదువులు చదివి ఇంజనీర్లు, సైంటిస్టులూ, ఎనకమిస్టులూ అయి దేశమాత సేవలో జీవితాన్ని ధన్యం చేసుకోం"డని ఆశీర్వదిస్తుండేవారు మీరు. మీరిచ్చిన ఈ మానసికమైన మద్దతులో మాలో చాలామందిమి మంచి మార్కులతో పాసయ్యేవాళ్లం.

అలా హైస్కూలు వదిలి వెళ్లిన మాలో కొందరు డాక్టర్లయ్యారు. కొందరు ఇంజనీర్లూ, మరికొందరు సైంటిస్టులూ అయ్యారు. ఏం చదివినా, ఎక్కడ ఉద్యోగాల్లోవున్నా వాళ్ళంతా మీచే మలచబడిన మానవతావాదులుగా జీవిస్తున్నారనే నా నమ్మకం. మీరిచ్చిన క్రమశిక్షణా ప్రభావం మా అందరి మీదా వుంది. అందుకు నేను ఒక నిదర్శనం.

ఇప్పుడు నేను మీ ఆశీర్వాదబలం వల్ల ఇంజనీరునై ఉత్తర హిందుస్థానంలో ఒక పెద్ద ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాను. మంచి ఉద్యోగం వచ్చింది కనుక ఈ మధ్యనే వివాహం చేసుకుని స్థిరపడ్డాను.

ఇంతకీ నేనీ ఉత్తరం రాయడానికి అసలు కారణం వేరు. ఏదో రాయబోయి గత స్మృతులు మూకుమ్మడిగా మనసు మీద దాడి చేయడంతో కలాన్ని ఆపలేక ఇవన్నీ రాసాను.

మేము హైస్కూలు వదిలి వచ్చే ముందు జరిపిన వీడ్కోలు విందులో మీరు మాట్లాడుతూ మమ్మల్ని ఉద్దేశించి "మీరంతా భవిష్యత్తులో పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగాల్లో స్థిపరపడిపోతారు. కానీ అప్పటికీ, ఎప్పటికీ కూడా మీ ఈ సత్యనారాయణ మాస్టారు బడిపంతులుగానే వుండిపోతాడు. గొర్రెతోకల్లాంటి మా జీతాలూ, జీవితాలూ కూడా ఎదుగు బొదుగూ లేకుండా ఇలాగే వుండిపోతాయి. కానీ ఎదిగిన పిల్లాపాపల్తో మా అవసరాలు మాత్రం మిన్నంటిపోతాయి. ధనమూలమిదం జగత్తని కదా పెద్దల వాక్యం. తగినంత ధనం లేకుండా ఈ సంసార సాగరాన్ని ఈదడం కష్టం. కనుక వేన్నీళ్ళకి చన్నీళ్ళు తోడన్నట్టుగా నా భార్య పేర్న జీవిత భీమా ఏజెన్సీ తీసుకోదల్చుకున్నాను. నా విద్యార్థులుగా నాపై అభిమానం వున్న మీరంతా పెద్ద పెద్ద ఉద్యోగాలు వచ్చి జీవితంలో స్థిరపడ్డాక ఎప్పుడైనా ఎల్ఐసి పాలసీ తీసుకోదలచినప్పుడు ఈ మాస్టార్ని గుర్తు చేసుకోండి" అని కోరారు.

ఆనాటి సభలోని ఎందరు విద్యార్థులు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో నేను చెప్పలేను. కాని ఆనాటి మీ భావన నా మనసులో చెరగని ముద్ర వేసుకుంది. ఆ రోజే నేను నిశ్చయించు కున్నాను. నాకు ఉద్యోగం రాగానేమీ దగ్గర లక్ష రూపాయలకి పాలసీ తీసుకోవాలని.

ఆ అవకాశం భగవంతుడీనాటికి కల్పించడం మిమ్మల్ని ఇంత దూరం నా దగ్గరకి రమ్మని రాయగలిగే ధైర్యం నాకు లేదు. అందుకు ఈ దసరాలకి నేను అటువైపు వచ్చినప్పుడు మీ ఇంటికి వచ్చి పాలసీ అప్లికేషను పూర్తిచేస్తాను. మీరీ ఉత్తరం అందిన వైనం తెలియజేస్తూ జవాబు మాత్రం ఇవ్వండి.

త్వరలోనే మీ దర్శనభాగ్యం అభిలషిస్తూ

మీ ప్రియ శిష్యుడు
రామారావు